సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



మరో తడిపై రైతుల ఆశలు

సదర్‌మట్ ఆయకట్టుకు ఏప్రిల్ 9తో ఏడు తడులు పూర్తికావడంతో నీటి విడుదల నిలిపి వేయనున్నారు. ఈనేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



ముగిసిన చెస్ పోటీలు

ఆర్జీయూకేటీ బాసర క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగిన చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ బహుమతులు ప్రదానం చేశారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.4/26.4

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అధిక వేడి, ఉక్కపోత కొనసాగుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి కూడా వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి



ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న డీఈ షకీర్

తాంసి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ డీఈ షకీర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈ నజీర్‌ను ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) ద్వారా అందించే సర్టిఫికెట్ కోర్సులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏడీ నాగేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి నైపుణ్యం అనుభవం కలిగిన వారికి నామమాత్రపు ఫీజుతో సర్టిఫికెట్ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9866565156 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

12న అపూర్వ సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 12న శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బండి రాంబాబు తెలిపారు. సోమవారం కళాశాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 నుంచి 2024 వరకు దాదాపు 40కి పైగా బ్యాచ్‌లకు సంబంధించి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి కమిటీలు వేశారు. అడహక్ కమిటీ అధ్యక్షుడిగా అభయ్ రాజ్, కార్యదర్శిగా ఉమా శంకర్, కోశాధికారిగా విజయ్ బాబు, సభ్యులుగా ఫాతిమా, నీల్ కమల్, జి.శ్రీకాంత్, ఆర్.సందీప్, ఆర్.ప్రణయ్, టి.అజయ్, ఎన్.రుత్విక్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రకటించారు.

కలెక్టరేట్ ఎదుట వీధి వ్యాపారుల ధర్నా



ధర్నా చేస్తున్న వీధి వ్యాపారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వీధి వ్యాపారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ డిమాండ్ చేశారు. గణేశ్ థియేటర్ స్థలంలోకి తమ దుకాణాలను మార్చాలనే అధికారుల నిర్ణయాన్ని తప్పుపడుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట వీధి వ్యాపారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనూ వీధి వ్యాపారులను గణేశ్ థియేటర్‌లోని స్థలానికి మార్చిన అధికారులు ఆ స్థలాన్ని మున్సిపల్ అధికారులు లీజుకు ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. మరోసారి తాత్కాలికంగా అదే స్థలంలో అధికారులు వారికి స్థలాలను కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, షౌకత్ హుస్సేన్, ఖిజర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌వో సస్పెన్షన్

సిరికొండ: సీజ్ చేసిన వాహనంలో వెదురు బొంగులు తరలిస్తున్న ఆరోపణలో సిరిచెల్మ రేంజ్ పరిధిలోని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి నరేశ్‌ను సస్పెండ్ చేసినట్లు డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ మంగళవారం తెలిపారు. ఈ విషయంలో పూర్తి విచారణ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సిలిండర్



జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు : 17
వంట గ్యాస్ కనెక్షన్లు : 2,88,346

గ్యాస్ కనెక్షన్ రకం	కనెక్షన్లు
జనరల్	2,05,250
దీపం	46,136
ఉజ్వల	36,960

నిన్నటి వరకు ఎల్‌పీజీ గ్యాస్ ధర : రూ.882
తాజాగా పెంపుతో గ్యాస్ ధర రూ.932

- సామాన్యుడిపై ఎల్‌పీజీ భారం
- సిలిండర్ ధరపై రూ.50 వడ్డింపు
- ఉజ్వల లబ్ధిదారులకు సైతం వర్తింపు
- జిల్లాలోని వినియోగదారులపై రూ.1.44 కోట్ల భారం

కైలాస్‌నగర్: వంటగ్యాస్ సిలిండర్ ధర మళ్లీ మండింది. ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరుకుల ధరలతో లబోదిబోమంటున్న సామాన్యుడి నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్యాస్ ధరను పెంచింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.50 పెంచుతున్నట్లుగా ప్రకటించింది. ఇది వరకు ధరల పెంపు కేవలం సాధారణ కనెక్షన్లకే పరిమితం కాగా తాజాగా ఉజ్వల లబ్ధిదారులకు సైతం వర్తింపజేస్తున్నట్లుగా ప్రకటించింది. పెరిగిన ధర మంగళవారం నుంచి అమల్లోకి రానుంది. ఫలితంగా జిల్లాలోని వంట గ్యాస్ వినియోగదారులపై నెలకు రూ.1.44 కోట్ల అదనపు భారం పడనుంది.

ఉజ్వల లబ్ధిదారులకు సైతం వర్తింపు..

ఇది వరకు వంట గ్యాస్ సిలిండర్ల ధర పెంపును కేంద్ర ప్రభుత్వం కేవలం సాధారణ గ్యాస్ కనెక్షన్ దారులకు మాత్రమే పరిమితం చేసేది. కానీ తాజాగా పెంచిన ధరను ఉజ్వల గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులకు సైతం వర్తింపజేస్తోంది. ఈ కనెక్షన్లన్నీ కేంద్రం నిరుపేదలకే మంజూరు చేసింది. వాటికి రూ.300 సబ్సిడీ ఇచ్చేది. తాజాగా అలాంటి వారిపైనా భారం మోపింది. ఒకవైపు వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం మరోవైపు వాటిపై ఇదివరకు ఇస్తున్న సబ్సిడీ కూడా పూర్తిగా ఎత్తివేసింది. నామమాత్రంగా రూ.47 చొప్పున సబ్సిడీ విడుదల చేస్తోంది. అది కూడా తక్కువగా ఉండటంతో ఆ వినియోగదారులు సైతం దాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. సబ్సిడీలను రద్దు చేయడం, ఒకేసారి రూ.50 ధర పెంచడంతో వినియోగదారులకు అదనపు భారంగా మారనుంది. కేంద్ర నిర్ణయంపై గ్యాస్ వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

వినియోగదారులపై తీవ్ర భారం

గతేడాది జూన్‌లో కేంద్ర చమురు సంస్థలు వంట గ్యాస్ ధరను రూ.50 పెంచడంతో పాటు వాటిని తక్షణమే అమల్లోకి తెచ్చాయి. అప్పటి నుంచి వాణిజ్య సిలిండర్ ధరను పలుమార్లు పెంచినప్పటికీ గృహావసరానికి వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌పై మాత్రం ఎలాంటి అదనపు ధరను పెంచలేదు. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే కేంద్ర ప్రభుత్వం వినియోగదారులపై భారాన్ని మోపేలా రూ.50 అదనంగా వడ్డించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని కేటగిరీలు కలిపి మొత్తం 2,88,346 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సగటున నెలకు ఒక్కో కనెక్షన్‌పై ఒక సిలిండర్ వినియోగించినా ప్రతీనెల వినియోగదారులపై రూ.1,44,17, 300 అదనపు భారం పడుతోంది. ఒకవైపు నిత్యావసర సరుకులన్నింటి ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా సిలిండర్ ధర రూ.50 పెంచడంతో వారికి మరింత అదనపు భారంగా మారనుంది.

అదనపు భారమే



ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. చాలీచాలని జీతాలతో నెట్టుకువస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచడం సరికాదు. పెరిగిన ధరలతో మాలాంటి సామాన్యులు ఆర్థికంగా అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. గ్యాస్ సబ్సిడీలను ఎత్తివేయడం సరికాదు. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి.

– గాజరి శశికళ, గృహిణి, ఆదిలాబాద్

తెరపైకి ‘సోయం’

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి రేసులో బాపూరావు
- అధిష్టానం దృష్టి ఈ మాజీ ఎంపీపై..
- సీనియర్ కావడంతోపాటు జిల్లాపై పట్టు
- సీఎం రేవంత్ రెడ్డి అనుచరుడిగా పేరు



సోయం బాపూరావు, మాజీ ఎంపీ

సాక్షి,ఆదిలాబాద్: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి ఎంపికలో తాజాగా సోయం బాపురావు పేరు తెరపైకి వచ్చింది.. పార్టీ అధిష్టానం ఈ మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే అయిన సీనియర్ నేతపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంపై సోయం బాపురావుకు పట్టు ఉండడంతో పార్టీ ముఖ్య నేతలు సీరియస్‌గా పరిశీలన చేస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ వారం రోజుల్లో నిర్ణయం వెలువడే అవకాశం ఉందని కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. డీసీసీ అధ్యక్ష పదవి రెండేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో పార్టీకి దిశానిర్దేశం చేయాల్సిన ముఖ్యమైన పదవిలో ఎవరూ లేకపోవడంతో పార్టీకి దిక్సూచి లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ పరంగా ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసి ఓటమి పాలైన నేతలే నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారు. ఆదిలాబాద్‌కు కంది శ్రీనివాసరెడ్డి, బోథ్‌కు ఆడే గజేందర్ ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. ఇటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓటమి చెందిన ఆత్రం సుగుణ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అయితే జిల్లాలో పార్టీ పరంగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడం, పార్టీ బాధ్యతలు మోసే జిల్లా అధ్యక్ష పదవి ఖాళీగా ఉండడంతో కార్యకర్తల్లో తెలియని శూన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవిని త్వరగా భర్తీ చేయాలని పలుమార్లు డిమాండ్ చేయడం, రాష్ట్రస్థాయిలో ముఖ్య నేతలను కలిసి విన్నవించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

ఇప్పటికైనా ఎంపిక జరిగేనా..

జిల్లా అధ్యక్ష పదవి కోసం ఇప్పటివరకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటి నుంచి వీరి నుంచే ఎవరినైనా ఎంపిక చేస్తారనే ప్రచారం జరుగుతూ వచ్చింది. ప్రధానంగా ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏకైక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును అధ్యక్షుడిగా నియమిస్తారనే ప్రచారం జరిగింది. ఈ దిశగా ఆయన కూడా దీనికి సుముఖంగా ఉన్నారనే ప్రచారం పార్టీ కార్యకర్తల్లో జరిగింది. ఆర్థికంగా బలంగా ఉన్న ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిని అధ్యక్షుడిగా నియమిస్తే పార్టీకి ఉపయుక్తంగా ఉంటుందన్న భావన కూడా వ్యక్తమైంది.

ఇక మీనాక్షి నిర్ణయమే తరువాయి..

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి ఉన్న సమయంలో ఆ నలుగురి పేర్లు ప్రచారం జరగగా మీనాక్షి నటరాజన్ రాకతో పార్టీలో పూర్తిస్థాయి పరిశీలన మొదలైంది. ఆ తర్వాతే జిల్లా అధ్యక్షుడిని ప్రకటిస్తామని ఆమె స్పష్టం చేశారు. తాజాగా సోయం బాపురావు పేరు తెరపైకి రావడం పార్టీలో చర్చనీయాంశమైంది. ప్రధానంగా ప్రస్తుతం రేసులో ఉన్న ముఖ్య నేతలందరి అభిప్రాయాలు సేకరించి తుది నిర్ణయాన్ని త్వరలో ప్రకటించే అవకాశం ఉందని పార్టీలో చెప్పుకుంటున్నారు.

సీనియర్ నేత..

సోయం బాపురావు గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు బీజేపీలో కొనసాగారు. 2019లో ఆ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. 2004లో బోథ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సోయం బాపురావు కాంగ్రెస్‌లో చేరడం జరిగింది. ఆ తర్వాత క్రమంలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ దక్కకపోవడంతో ఆయన పార్టీని వీడారు. మొత్తంగా గతంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. ప్రస్తుతం పార్టీ ఈ జిల్లాలో సీనియర్ నేతపై దృష్టి సారించడంతో ఆయన పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

‘టైగర్ ఫోర్స్’కు సన్నద్ధం

- రాష్ట్రంలో పులుల రక్షణకు చర్యలు
- ‘కవ్వాల్’లోనూ ముప్పులో పెద్దపులులు
- రక్షక దళం ఏర్పాటైతే వేట తగ్గే అవకాశం

కవ్వాల్ అభయారణ్యం వివరాలు(చ.కి.మీ)	
కోర్ 892.23,	బఫర్ 1123.21
మొత్తం విస్తీర్ణం: 2015.44	



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పులుల సంరక్షణకు రాష్ట్ర అటవీ శాఖ టైగర్ ఫోర్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దీంతో ‘కవ్వాల్’ టైగర్ రిజర్వు మరింత పటిష్టం కాబోతోంది. ఏటా ఉమ్మడి జిల్లా పరిధిలోకి అనేక పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఏడు నుంచి ఎనిమిది పులుల వరకు సంచరిస్తున్నాయి. ప్రసిద్ధ బెంగాల్ టైగర్లు ఇక్కడ సంచరించాయి. కోర్ ఏరియా వరకు వెళ్లకుండా కారిడార్ ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాయి. మహారాష్ట్రలోని తడోబా అంధేరి, తిప్పేశ్వర్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యం నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంది. పెన్‌గంగా, ప్రాణహిత నదులు దాటి ఉమ్మడి జిల్లాలో అడుగుపెడుతున్నాయి. ఈ పులులకు వేట ముప్పు పొంచి ఉంది. ఈ క్రమంలో ఇక్కడ పులులను కాపాడుకోవాలంటే మరింత నిఘా అవసరం ఏర్పడింది. మంచిర్యాల జిల్లాలో మొత్తం భౌగోళిక ప్రాంతంలో అటవీ 41.09శాతం విస్తరించి ఉండగా, కుమురం భీం ఆసిఫాబాద్‌లో 40.24, ఆదిలాబాద్‌లో 29.51, నిర్మల్‌లో 29.83శాతాల్లో విస్తరించి ఉంది. ‘ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు’ 2022 రిపోర్టు ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 115.50, నిర్మల్‌లో 45.34చ.కి.మీ.చొప్పున అటవీ విస్తీర్ణం తగ్గినట్లు తేలింది. ఈ క్రమంలో వన్యప్రాణులు, అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపు టైగర్‌ఫోర్స్ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా అడవుల రక్షణకు దోహదం చేసే అవకాశాలు ఉన్నాయి.

ఎన్నో ఏళ్లుగా డిమాండ్లు

టైగర్ రిజర్వులు ఉన్న రాష్ట్రాల తరహాలో ఇక్కడ కూడా టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లు ఉన్నాయి. కవ్వాల్ పరిధిలో పులులు ఇతర వన్యప్రాణుల సంరక్షణ కోసం ఇప్పుడున్న సిబ్బంది, అధికారులకు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. సరిపడా సిబ్బంది లేమితోపాటు పని ఒత్తిడితో ఉన్నారు. చాలా చోట్ల ఖాళీలు ఉన్నాయి. ఇక పులి సంచారం ఉన్న చోట్ల వేటగాళ్ల నిరోధం, ముప్పు తప్పించేందుకు అటవీ అధికారులు శ్రమించాల్సి వస్తోంది. ప్రతీ ఏటా పులులు ఏదో కారణంగా ఇక్కడ మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ కంచెలు, వేటతో ప్రమాదంలో పడుతున్నాయి. కాగజ్‌నగర్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పులులు ప్రాణాలు కోల్పోయాయి. క్షేత్రస్థాయిలో పటిష్ఠ నిఘా లోపం ఏర్పడుతోంది. పులుల సంరక్షణ కోసమే దళం ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో పులుల సంతతి పెంపునకు ఉపయోగపడనుంది.

‘పది’ మూల్యాంకనం షురూ



సీసీ ఫుటేజ్ ద్వారా పరిశీలిస్తున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో స్పాట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 15 వరకు ప్రక్రియ కొనసాగనుంది. మొదటి రోజు మూల్యాంకనం ఆలస్యంగా ప్రారంభంకాగా ఒక్కో ఉపాధ్యాయుడికి 20 జవాబు పత్రాలను అందజేశారు. మంగళవారం నుంచి 40 చొప్పున అందించనున్నట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్పాట్ కేంద్రంలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, ఫ్యాన్లు, వైద్య సౌకర్యం కల్పించారు. అయితే స్పాట్ కోసం 479 మంది ఏఈలకు ఉత్తర్వులు జారీ చేయగా 448 మంది, 82 మంది సీఈలకు గానూ 78 మంది రిపోర్టు చేశారు. 164 మంది స్పెషల్ అసిస్టెంట్లకు గానూ 78 మంది విధులకు హాజరైనట్లు డీఈవో పేర్కొన్నారు. సాంఘిక శాస్త్రం, స్పెషల్ అసిస్టెంట్ల కొరత కొంత ఉందని, మిగతా సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు హాజరైనట్లు పేర్కొన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు అనారోగ్యం, వివిధ కారణాలతో స్పాట్ విధులకు హాజరు కాలేమని డీఈవోను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఆయా సంఘాల నాయకులు స్పాట్‌కు సంబంధించి మినహాయింపు, వివిధ సమస్యలపై డీఈవోకు విన్నవించారు. స్పాట్ కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జిగా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య వ్యవహరించారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం చేపట్టనున్నట్లు తెలిపారు. మూల్యాంకనం సమయంలో సెల్‌ఫోన్ వెంట ఉంచుకోవద్దని సూచించారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా
- సత్వరమే పరిష్కరించాలని ఆదేశం

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి అర్జీలు స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధితాధికారులకు అందజేస్తూ వాటిని పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కాగా ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 111 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదన వారి మాటల్లోనే...

సాగునీరు విడుదల చేయాలి



అయ్యా.. ఈ యేడు సాగు చేసిన పత్తి పంటలో గులాబీరంగు పురుగు ఉధృతి పెరగడంతో ఆ పంటను తొలగించాం. మత్తడివాగు ప్రాజెక్ట్ నీటి ఆధారంగా యాసంగి సీజన్‌లో జొన్న పంటను సాగు చేశాం. ప్రస్తుతం చివరిదశలో ఉన్న పంటకు నీరు అందకపోవడంతో ఎండిపోయే పరిస్థితి ఉంది. మత్తడివాగు ప్రధాన కాలువ నుంచి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్‌శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించగా ఈ నెల 1నుంచి విడుదల చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు నీటిని విడుదల చేయలేదు. తమరు స్పందించి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుని పంటలను కాపాడాలి.

– జందాపూర్ రైతులు, ఆదిలాబాద్

బ్యాటరీ వెహికిల్ ఇవ్వాలి



సార్...నా చిన్నతనంలోనే పోలియో సోకడంతో కుడి కాలు, చెయ్యి పడిపోయాయి. దీంతో నేను ఎలాంటి పని చేయలేని పరిస్థితి ఉంది. నిరుపేదనైన నాకు బ్యాటరీతో కూడిన మూడు చక్రాల వాహనం అందించాలని అధికారులకు పలుమార్లు విన్నవించా. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేశా. కానీ అధికారులు స్పందించడం లేదు. నిరుపేదనైన నాకు ఆ వాహనం కొనుగోలు చేసే శక్తి లేదు. కనుక తమరు స్పందించి బ్యాటరీ వెహికిల్‌ను మంజూరు చేయాలి

– రవికాంత్, తోషం టొక్కిగూడ, గుడిహత్నూర్

బతికుండగానే చంపేశారు



అయ్యా నా భర్తపేరు భీమనత్తిని మల్లేశం. ఆయనకున్న ఇద్దరు భార్యల్లో నేనొకరు. మా ఆయన వయస్సు 66, మా అక్క మల్లవ్వ వయస్సు 62. పెన్షన్ కోసం దరఖాస్తు చేయగా పంచాయతీ అధికారులు ఇద్దరిలో ఒకరికి మాత్రమే ఇస్తామని చెప్పారు. దీంతో మేమిద్దరం మా భర్తకు ఇవ్వాలని కోరగా రెండేళ్ల క్రితం ఆయనకు మంజూరు చేశారు. ఒక నెల పెన్షన్ తీసుకున్నాం. మరుసటి నెలలో పెన్షన్ కోసం వెళ్తే నా భర్త చనిపోయినట్లుగా ఉందని చెప్పారు. మా అక్క పేరును కూడా చనిపోయినట్లుగానే రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో ఆ ఇద్దరికీ పెన్షన్ రావడం లేదు. మాది పేద కుటుంబం. నా భర్త షుగర్ పేషెంట్. మందుల కొనుగోలుకు సైతం ఇబ్బంది అవుతోంది. పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, డీఆర్‌డీఏ కార్యాలయాల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పెన్షన్ పునరుద్ధరించి నాకు న్యాయం చేయాలి.

– భీమనత్తిని సత్తవ్వ, ఉట్నూర్

నిరంతర ప్రయత్నాలతోనే విమానాశ్రయం ఏర్పాటు



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన విమానాశ్రయం ఏర్పాటు నిరంతర ప్రయత్నాలతోనే సాధ్యమైందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మాట్లాడారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎయిర్ పోర్ట్ అథారిటీకి ఆదేశాలు జారీ చేశారన్నారు. పౌర విమానయాన సేవలతో పాటు వైమానిక శిక్షణా కేంద్రం సైతం ఏర్పాటు కానుందన్నారు. రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న 369 ఎకరాలు ఉపయోగించుకునేలా చర్యలు ప్రారంభించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ అంశం మరింత వేగవంతం కావడం శుభపరిణామమన్నారు. త్వరలోనే ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ సైతం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంయుక్తంగా ఈ ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించినప్పటికీ పలు కారణాలతో నిలిచిపోయిందన్నారు. కొందరు స్థానిక నాయకులు రాజకీయ లబ్ధి కోసం తమ వల్లే విమానాశ్రయం సాధ్యమైందని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. రాజు, లాలా మున్నా, మయూర్ చంద్ర, నగేశ్, జోగు రవి, వేద వ్యాస్, దినేష్ మటోలియా, కృష్ణ యాదవ్, శ్రీనివాస్, సుభాష్, రాకేష్, భూమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేసీబీ సీజ్

జన్నారం: రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం దస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామ సమీపంలోని రిజర్వ్‌ఫారెస్ట్‌లో మొరం తవ్వుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా మట్టి తవ్వుతున్న జేసీబీని సీజ్ చేయడంతో పాటు జేసీబీ యజమాని మహేశ్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం రూ.55,000 జరిమానా విధించినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

కోర్టు నోటీస్ ధిక్కరణ.. మహిళకు జైలు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ వందన కోర్టు నోటీస్ ధిక్కరించిన కేసులో రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి, ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్బాల్‌పూర్ గ్రామానికి చెందిన వందన గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. ఆమెపై కేసు నమోదు చేసి, చార్జిషీట్ వేసి కోర్టుకు హాజరు కావాలని కోర్టు నోటీస్ ఇచ్చారు. అయినా ఆమె కోర్టుకు హాజరు కాలేదు. దీంతో ఖానాపూర్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ సోమవారం అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో ఆమెను అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ వందనకు 10రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించడంతో ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం దొంగ పట్టివేత



పట్టుబడిన దొంగతో పోలీసులు

ముధోల్: మండల కేంద్రంలోని స్థానిక కాల్వగల్లీలో ద్విచక్రవాహనం దొంగతనం చేసిన వ్యక్తిని కాలనీవాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కాల్వగల్లీలో ఉన్న హనుమాన్ ఆలయంలో హుండీ దొంగతనం చేసేందుకు దొంగ విఫలయత్నం చేశాడు. అనంతరం అదే గల్లీలో ఉన్న ద్విచక్రవాహనాన్ని దొంగిలించి వెళ్తుండగా కాలనీవాసులు పట్టుకున్నారు. ఎస్సై సంజీవ్‌కుమార్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. వారికి కాలనీవాసులు దొంగను అప్పగించారు. దొంగను బాసర మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్‌గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడవి పంది దాడి.. ఒకరికి గాయాలు

ఇచ్చోడ: అడవిపంది దాడిలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అడే గామ(కే)లో బద్దం రమేశ్ రెడ్డి వద్ద గణపతి కొన్నేళ్లుగా వ్యవసాయ పాలేరుగా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా అడవి పంది దాడి చేయడంతో గణపతి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రమేశ్‌రెడ్డి క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు.

మరో తడిపై రైతుల ఆశలు

- రేపటి వరకు ఏడు తడులు పూర్తి
- పొట్టదశలో వరి పంట
- యాసంగి సాగు ఆలస్యంతో సమస్య
- ఆందోళనలో సదర్‌మట్ ఆయకట్టు రైతులు



సదర్‌మట్ ఆనకట్ట

కడెం: సదర్‌మట్ ఆయకట్టు ద్వారా ఖానాపూర్, కడెం మండలాలకు ఏటా ఏడు తడుల నీటిని వారబందీ పద్ధతిన అధికారులు విడుదల చేస్తున్నారు. ఏప్రిల్ 9తో ఏడు తడులు పూర్తికావడంతో నీటి విడుదల నిలిపివేయనున్నారు. ఈనేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉందని ఈసమయంలో సాగు నీటిని అందించకుంటే పెద్దఎత్తున నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ఆయకట్టుకు మరోతడి సాగు నీరు అందించి పంటను కాపాడాలని వేడుకుంటున్నారు. కాగా సదర్‌మట్ ఆయకట్టు ద్వారా ఖానాపూర్, కడెం మండలాల్లో 13వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈఏడాది యాసంగిలో నాట్లు కాస్త ఆలస్యం కావడంతో సాగు నీటి సమస్య ఉత్పన్నమవుతోంది.

ఏడు తడులు..

సదర్‌మట్ ఆయకట్టుకు జనవరి 2 నుంచి వారబందీ పద్ధతిన (ఏడు రోజులు నీటి విడుదల, ఎనిమిది రోజులు నిలిపివేత) ఏప్రిల్ 9వరకు ఏడు తడుల నీటిని అందిస్తున్నారు. సదర్‌మట్ కేటాయించింది 600 క్యూసెక్కులు కాగ, పైనుంచి మాత్రం 360, 450 క్యూసెక్కుల చొప్పున నీటిని మాత్రమే విడుదల చేశారు. దీంతో కడెం మండలంలోని పాతమద్దిపడగ, కొత్తమద్దిపడగ, పెద్దూర్, వకీల్‌నగర్, చిట్యాల్ తదితర గ్రామాలకు సక్రమంగా సాగు నీరందక కొన్ని చోట్ల పంటలు ఎండిపోయాయి. ఇటీవల ఆయకట్టును పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్ ఏప్రిల్ చివరి వరకు సాగు నీరందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎస్సారెస్పీలో నీటిమట్టం తగ్గడంతో తాగునీటి అవసరాల దష్ట్యా మరో తడిని అందిస్తారో లేదో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, నీటిపారుదల శాఖ సీఈ స్పందించి మరో తడిని అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

పంటలు ఎండిపోతాయి..



సదర్‌మట్ చివరి ఆయకట్టు మాది. కాలువ నీరు సరిపడా అందక పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉన్నందున మరో తడి నీటిని అందిస్తేనే పంటలు చేతికందుతాయి.
– ధర్మాజీ రమేశ్, రైతు, చిట్యాల్

మరోతడి సాగు నీరందించాలి..



సదర్‌మట్ ఆయకట్టుకు ఏప్రిల్ చివరి వరకు సాగు నీరందించాలి. సాగు నీరందకపోతే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారు. సాగు నీటిని విడుదల చేయకుంటే రైతుల పక్షాన పోరాడుతాం.
– హపవత్ రాజేందర్, రైతు నాయకుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



సదర్‌మట్ కింద ఈ ఏడాది యాసంగి పంటల సాగు ఆలస్యమవడంతో సాగు నీటి సమస్య ఏర్పడింది. ఈనెల 9 వరకు ఏడు తడులు నీరందిస్తాం. మరో తడి నీటిని అందించాలని ఆయకట్టు రైతుల కోరుతున్నారు. రైతుల విజ్ఞప్తిని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– విఠల్, ఈఈ, కడెం

కష్టాల కడలి దాటి కవిగా మెరిసి..!

కేవలం ఒక్కపూట భోజనం.. చదువుకోవడానికి ఆరు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి.. ఆర్థిక ఇబ్బందులు.. ఇవేమి ఆ నిరుపేద యువకుడి లక్ష్యాన్ని అడ్డుకోలేకపోయాయి. కష్టాలను ఎదురొడ్డి చదివిన ఆయన ప్రభుత్వ ఉద్యోగం సాధించి మోటివేషనల్ స్పీకర్‌గా, కవిగా ఎన్నో ప్రశంసలు పొంది అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. అతడే భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన రెడ్ల బాలాజీ. – భైంసా

- కవితలు, వ్యాసాలు, కథలతో సాహిత్యసేవ
- ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు
- ఆదర్శంగా నిలుస్తున్న రెడ్ల బాలాజీ

నిరుపేద కుటుంబ నేపథ్యం..

ఇలేగాం గ్రామానికి చెందిన రెడ్ల ధృపతి –పోశెట్టి దంపతులకు తొమ్మిది మంది పిల్లలు. తొమ్మిదో సంతానంగా రెడ్ల బాలాజీ జన్మించారు. పాఠశాలకు ఇచ్చే సెలవు రోజుల్లో తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు కూలీగా వెళ్లేవారు. ఇలేగాంలో ఐదవ తరగతి వరకు చదివిన బాలాజీ పక్క ఊరు దేగాంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివారు. ఈ ఐదేళ్లపాటు రోజూ ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లేవారు. భైంసాలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయంలోనే పిల్లలకు ట్యూషన్‌లు చెబుతూ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ గుంటూరులో బీఈడీ పూర్తిచేశారు. ఈ క్రమంలోనే పోస్టాఫీసులో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా ఉద్యోగం సాధించారు.

సాహిత్యంపై మక్కువ..

కవితలు, వ్యాసాలు, కథలు రాస్తూ బాలాజీ అందరికి తనలో ఉన్న సాహిత్యాన్ని పరిచయం చేశారు. ఇప్పటికే ఇలేగాం గ్రామంలో ఉన్న బాపూజీ మహరాజ్ చరిత్ర, గీత శక్తి, వసుధ వాణి, మధుర వాణి, గీతవాణి వంటి ఆధ్యాత్మిక, సామాజిక, ధార్మిక పుస్తకాలు రాశారు. ఆయన రాసిన పుస్తకాలకు వాణిశ్రీ పురస్కారం, నంది పురస్కారం, జాతీయ విశ్వశాంతి పురస్కారాలు లభించాయి. పలు వేదికల్లో రెడ్ల బాలాజీకి స్వర్ణ కంకణం, బంగారు పతకం అందించారు. సాహితీ రత్న, ఆదర్శరత్న, గౌతమి కవి శ్రేష్ఠ, కవి సామ్రాట్ వంటి బిరుదులు అందుకున్నారు. తెలుగు సాహిత్యంలో రాణించిన రెడ్ల బాలాజీకి అప్పటి నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి ప్రశంసా పత్రం అందించారు. ఇటీవలే ఆయన రచనలకు గాను డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా ప్రముఖ కవి రచయిత డాక్టర్ శ్రీధర్, ప్రముఖ డైరెక్టర్ వి.సముద్ర చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. బాలాజీ తనకు వీలు కలిగినప్పుడల్లా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను చైతన్యపరుస్తున్నారు. చిన్నప్పుడు తానుపడ్డ కష్టాలు, ఎదురైన అనుభవాలు, ఆర్థిక ఇబ్బందులు వివరించి విద్యార్థులకు ధైర్యం చెబుతున్నారు.



అప్పటి జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రెడ్ల బాలాజీ (ఫైల్)

కరెన్సీ సేకరణే హాబీగా..

- విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు



సేకరించిన కరెన్సీతో అనిల్

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అనిల్ కరెన్సీ సేకరణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాడు. విదేశాల నుంచి ఎవరైనా వచ్చినట్లు తెలిసినా, వివిధ ప్రదేశాలకు వెళ్లినప్పుడు విదేశీయులు కనిపించినా వెంటనే వారి వద్దకు వెళ్లి కరెన్సీని సేకరించి భద్రపరుస్తున్నాడు. ఇప్పటి వరకు తాండూర్, సీతారాంపల్లి, ఆస్నాద్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించగా అక్కడి విద్యార్థులకు వివిధ దేశాల కరెన్సీపై అవగాహన కల్పించారు. కరెన్సీతో పాటు ప్రకృతి, పక్షులు, అందమైన ఫొటోలు తీయడం అతని హాబీగా మార్చుకున్నాడు.

31 దేశాల కరెన్సీ సేకరణ

2008 నుంచి ఇప్పటి వరకు 31 దేశాల కరెన్సీ సేకరించి సేకరించాడు. వివిధ దేశాల కరెన్సీ పేర్లు, వాటి విలువలు విద్యార్థులకు తెలియపర్చేందుకు కరెన్సీని సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొంటున్నాడు. విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లినా కాంపిటేటివ్ పరీక్షల్లో ఉపయోగకరంగా ఉండేందుకు భారతదేశంలో ఇప్పటి వరకు ఉన్న పాత, కొత్త కరెన్సీలను భద్రపరుస్తున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లి కరెన్సీ సేకరించడం, ఫొటోలు తీయడంపై దృష్టి పెడుతున్నాడు. విద్యార్థులకు పాఠాలతో పాటు ప్రకృతి, వాటి విలువలు, కరెన్సీ, ఇతర విషయాలపై అవగాహన కల్పిస్తున్నాడు.

అవగాహన కల్పించేందుకే..

విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే వివిధ దేశాల కరెన్సీ సేకరిస్తున్నా. కరెన్సీ సేకరణ, ఫొటోలు తీయడం హాబీగా ఎంచుకున్నా. విద్యార్థులకు పాఠాలతో పాటు కరెన్సీపై అవగాహన కల్పిస్తున్నా.
– అనిల్, ఉపాధ్యాయుడు

- కాల్‌టెక్స్ ఇళ్ల చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- మరో ముగ్గురి కోసం బృందాల గాలింపు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రవికుమార్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు తెలియజేస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: సంచలనం సృష్టించిన బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని రెండిళ్లలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. నలుగురు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి దొంగిలించిన నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఏ.రవికుమార్ వివరాలు వెల్లడించారు. గత నెల 29వ తేదీ తెల్లవారుజామున బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో సాన శ్రావణ్, అత్తె సుధాకర్ ఇళ్లలో అగంతకులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇళ్ల తాళాలు పగులగొట్టి 14.5 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.20 వేల నగదు, నాలుగు మోటారు సైకిళ్లను దొంగిలించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను గజానంద్ పార్థి అని కాల్‌టెక్స్ ఏరియాలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. మరో ముగ్గురు నిందితులు లాల్‌జీ, రోషన్, ఘోటియా పరారీలో ఉన్నట్లు ఏసీపీ వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణా జిల్లా కనేరా గ్రామానికి చెందిన నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఇళ్లలో చోరీ చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, త్వరలోనే పట్టుకుంటామన్నారు.

పలు రాష్ట్రాల్లో నిందితులపై కేసులు

మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లతో పాటు ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నా కూడా చోరీ చేస్తున్నట్లు దర్యాప్తులో తేల్చారు. నిందితులు మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకుంటున్నారు. వీరిపై ఆయా రాష్ట్రాల్లో దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. నిందితుడిని పట్టుకున్న బెల్లంపల్లి రూరల్‌సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై కె.మహేందర్, తాళ్ల గురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్, నెన్నెల ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

‘నీతి ఆయోగ్’లో నార్నూర్ ముందంజ



డిజిటల్ తరగతులు పరిశీలిస్తున్న మనోజ్‌సింగ్ బోరా

నార్నూర్: నీతి ఆయోగ్ ‘ఆకాంక్ష’ బ్లాక్‌లో నార్నూర్ మండలం ఎంపికై అభివృద్ధి సాధిస్తుందని, మొదటి 30 బ్లాక్‌లల్లో మొదటి స్థానంలో ఉందని ఆకాంక్ష డైరెక్టర్ మనోజ్‌సింగ్ బోరా అన్నారు. ఆయన సోమవారం తన బృందంతో కలిసి మండలంలోని జామ్‌డా, గుంజాల గ్రామాల్లో పర్యటించారు. జామ్‌డాలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన బృందం సందర్శించింది. విద్యార్థినులు వీక్షిస్తున్న డిజిటల్ తరగతులను బృందం డైరెక్టర్ మనోజ్‌సింగ్‌బోరా పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు అనిల్ చహ్వాణ్, కే బాషా, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో రాజేశ్వర్ రాథోడ్, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, పీడీ మిల్కా, సీడీపీవో శారద, సూపరింటెండెంట్ గంగాసింగ్ రాథోడ్, ఎంపీవో సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

‘దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి’

జన్నారం: అడవి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకోగా విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్ భర్తన్‌పేట్ బీట్ అధికారి రుబీనా తలత్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎఫ్ఎస్‌వో హన్మంతరావుతో కలిసి మాట్లాడారు. ఈనెల 4న భర్తన్‌పేట్ బీట్ పరిధిలో విధుల్లో భాగంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకోగా ఎజాజోద్దీన్ అనే వ్యక్తి తనను దుర్భాషలాడారన్నారు. ట్రాక్టర్‌ను రేంజ్‌కు తరలిస్తుండగా కొత్తపేట్ గ్రామ సమీపంలో అడ్డం తిరిగి రియాజోద్దీన్ అనే మరో వ్యక్తి తన చేయి పట్టుకొని లాగడంతో పాటు కర్రతో కొట్టినట్లు తెలిపారు. అడ్డు వచ్చిన తన భర్త అఫ్రోజ్‌పై కూడా ఇద్దరు దాడి చేసి గాయపర్చినట్లు పేర్కొన్నారు. కాగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజవర్ధన్ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

మృతికి కారకుడైన వ్యక్తికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనం అజాగ్రత్తగా నడుపుతూ ఒకరి మృతికి కారకుడైన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి దుర్గరాణి సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి సీహెచ్ విజయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మే 1, 2019న ఆదిలాబాద్ పట్టణంలోని ధోబి కాలనీకి చెందిన నేరెళ్ల వినోద్, ఆయన కుమారుడు అఖిల్ ఇద్దరు ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ నుంచి తాంసికి బయల్దేరి వెళ్లారు. మార్గమధ్యలో హస్నాపూర్ వద్ద ఎదురుగా బైక్‌పై వస్తున్న జాదవ్ అరవింద్ అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించగా బాలుడు అఖిల్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదం సమయంలో పక్కనుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఒకరి మృతికి కారకుడైన అరవింద్‌కు జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జీడీసీ కాలనీకి చెందిన నిర్మల్కర్ రాజ్‌కుమార్(36) కంటి సమస్యతో బాధపడుతున్నాడు. ఎడమ కన్నుచూపు కోల్పోగా, దాని ప్రభావం కుడికన్నుపై పడింది. కుటుంబాన్ని ఏవిధంగా పోషించాలని మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఢిల్లీలో ఆదివాసీ కళాకారుల ప్రదర్శన



ఢిల్లీ ప్రదర్శనలో ఆదిలాబాద్ కళాకారులు

ఇచ్చోడ: ఢిల్లీలో ఆదిలాబాద్ జిల్లా సకల కళా సంక్షేమ సంఘం ఆదివాసీ కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన జయతి జయ భారత్ కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ కళాకారులు తమ కళను ప్రదర్శించారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలలోని విభిన్న సంస్కృతుల కళాకారులను ఆహ్వానించారు. ఈ ప్రదర్శనల్లో సకల కళా సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ ఆధ్వర్యంలో కాత్లె అనంద్, గంగోత్రి, రీతులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



రాముగూడలో గంజాయి మొక్కలు

ఉట్నూర్‌రూరల్: గంజాయి సాగు చేసినా, సరఫరా చేసినా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇన్‌చార్జి ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా కరీంనగర్‌కు వెళ్తున్న ఆటోలో ముగ్గురు వ్యక్తులతో పాటు కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదివారం మండలంలోని కుమ్మరితాండ గ్రామపంచాయితీ పరిధిలోని రాముగూడ గ్రామానికి చెందిన కుమ్ర సోనేరావు ఇంటి పెరడులో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేశారు. పెరడులో 20 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు.

ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ షంషీర్‌నగర్‌లో సర్వే నంబర్ 170లోని ప్రభుత్వ భూమిలో ఇళ్లు కడుతున్న ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య తెలిపారు. మహబూబీ, అమానుల్లాఖాన్‌లు అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తుండడంతో కేసు నమోదు చేశామన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఉట్నూర్ మండలం చాందూరి గ్రామానికి చెందిన పోసుబాయి తనకి ఏదైనా అంగన్వాడీ సెంటర్‌లో ఉద్యోగం కల్పించాలని, తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన గట్ల నర్సయ్య తనకి మేకల లోన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని, నేరిగొండ మండలం కుంటాల గ్రామానికి చెందిన సిడాం లక్ష్మి తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఆశ వర్కర్ ఉద్యోగం కల్పించాలని కోరారు. వీరితో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన వారు పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. ఏవో దామదర స్వామి, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఈ ఎస్.శివ నాగేశ్వర రావు, అధికారులు

ఆదిలాబాద్: వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు బీఎస్ఎన్ఎల్ ఏరియా డివిజనల్ ఇంజనీర్ ఎస్.శివనాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సోమవారం వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఎస్‌డీఈ చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎంఎన్‌పీ, సిగ్నల్, కనెక్టివిటీ, ఇంటర్నెట్, టెలిఫోన్ బిల్లులకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు సేవా కేంద్రాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ‘మేము వింటాం –మేము మెరుగుపరుస్తాం’ నినాదంతో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రానికి వచ్చిన 25 ఫిర్యాదులలో 20 పరిష్కరించగా ఐదింటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈనెల 8, 16, 23 తేదీల్లో నిర్మల్, 9, 28న కాగజ్‌నగర్, 11, 25, 29 తేదీల్లో మంచిర్యాల, 12, 24 తేదీల్లో ఖానాపూర్, 15, 21న బెల్లంపల్లి, 17, 26 తేదీల్లో ఆసిఫాబాద్, 19, 30 తేదీల్లో భైంసాలలో సేవాకేంద్రాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏజీఎం ఎస్.రంజిత్, ఎస్డీఈలు, జేటీవోలు పాల్గొన్నారు.

ఐడియా టవరంటూ టోకరా

- రూ.72,600 మోసపోయిన బాధితులు

ముధోల్: వ్యవసాయ భూమిలో ఐడియా టవర్ ఏర్పాటు చేసుకుంటే రూ.25 లక్షలు ఇస్తామని ఫోన్‌లో మాయమాటలు చెప్పి రూ.72600లు కాజేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన బాధితుడు సత్తి రాములు, భార్య లలితలకు ఈనెల 2వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి పంట పొలంలో ఐడియా టవర్ ఏర్పాటు చేసుకుంటే కంపెనీ ద్వారా రూ.25లక్షలు అందజేస్తామన్నారు. అయితే బాండ్ రూపొందించేందుకు ముందుగా డబ్బులు కట్టాలని తెలిపారు. దీంతో బాధితులు విడతల వారీగా 3, 4వ తేదీల్లో మొత్తం రూ.72,600 చెల్లించారు. దీంతో సత్తి రాములు పేరుమీదుగా రూ. 25లక్షల 11 పేజీల బాండ్ పంపించారు. అనంతరం వారి నుంచి ఎలాంటి ఫోన్ రాకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి బాధితులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామ సమీపంలోని దర్ల కిష్టన్న డెయిరీ ఫామ్‌లో సోమవారం ఒకరు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఉండం గ్రామానికి చెందిన తంగాడపెల్లి గజానన్ (28) కిష్టన్న డెయిరీ ఫామ్‌లో కూలీ పనులు చేస్తుండేవాడు. ఆదివారం మద్యం మత్తులో చేనుకు వెళ్లిన గజానన్ కొంత సేపు డైలీ వర్కర్ కుందన్ కుమార్‌తో కలిసి పని చేశాడు. అనంతరం కుందన్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం 5.30 గంటలకు కుందన్ కుమార్ గడ్డిచేనుకు వెళ్లే సరికి గజానన్ మృతి చెంది ఉన్నాడు. గజానన్ మద్యం మత్తులో ఎండలో పనిచేయడంతో వడదెబ్బ తాకిందా లేదా విషపురుగు కుట్టిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గజానన్ భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.